# ఉత్తమ స్థితి

మనిషి జన్మతః కొన్ని లక్షణాలు పుణికి పుచ్చుకొంటాడు. ఇంకా కొన్నింటిని సంఘజీవనంలో పలు రకాల మనుషులతో మసలుతూ అలవరచుకుంటాడు. ఆ లక్షణాల్లో కొన్నింటిని సమాజం ఆమోదిస్తుంది. మరికొన్నింటిని నిరసిస్తుంది, విమర్శిస్తుంది. నలుగురితోనూ మానవుడు జీవనయానం కొనసాగిస్తున్నప్పుడు- అతడి గుణాలు వారి మన్నన పొందాలే తప్ప, గర్హించేలా ఉండకూడదు.

ఇతరుల ఆలోచనలకు అభిప్రాయాలకు తగిన విలువనిస్తూ, వారి తలలో నాలుకలా మనిషి సాగిపోవాలి. ఎవరైనా నాయకత్వానికి నీరాజనాలు పడతారు తప్ప, నియంతృత్వానికి కాదు. అందరితో ఎప్పుడూ కలిసిమెలిసి ఉండటమే మానవుడి లక్షణం. 'నలుగురితో నారాయణ' అని పెద్దలు అనడంలో ఆంతర్యం అదే!

అందరికీ అన్నీ తెలియాలని లేదు. కొన్ని పనులు నెరవేర్చడంలో మనిషికి అశక్తత కలగవచ్చు. వైఫల్యాలూ ఎదురుకావచ్చు. అవసరమైన పనిలో సరైన వ్యక్తి సహకారం తీసుకుంటే, మంచి ఫలితం లభిస్తుంది. పరిస్థితి సానుకూలంగా మారుతుంది. అందుకే 'అందరినీ కలుపుకొనిపోవాలి' అని పెద్దలంటారు.

రావణ సంహారానికి అనువుగా, శ్రీరాముడికి పలువురు దోహదపడ్డారు. ఆంజనేయుడు, విభీషణుడు, సుగ్రీవుడు, జటాయువు వంటి అనేకుల సహాయం ఆయనకు లభించింది. బుజ్జి ఉడత సైతం చేతనైనంతగా సహకరించింది. యుద్ధసమయంలో రావణుడికి అయినవాళ్లతో సహా ఎవరూ స్వచ్ఛంద సహకారం అందించడానికి సిద్ధపడలేదు. అతడు సర్వం కోల్పోయాడు. రాముడే గెలిచాడు. లోకంలో ధర్మవర్తనకు గల బలం అదే.



అంతర్యామి

అందరూ ఆ మార్గంలో నడవాల్సిందే, ధర్మాన్ని విధిగా ఆచరించాల్సిందే!

ధర్మాచరణకు వీలుగా పెద్దలు పలు కట్టుబాట్లు రూపొందించారు. అవి బంధనాలు కావు. అవన్నీ మనిషి కచ్చితంగా నెరవేర్చాల్సిన బాధ్యతలు. నిబంధనలు దాటనంత వరకు, సమాజం సమతుల్యతతో వెలుగొందుతుంది. నియమాల్ని తృణీకరించి వ్యవహరిస్తే, ఎటువంటి వాళ్లకైనా అధోగతి తప్పదు.

'ధర్మం శరణం గచ్ఛామి' అని బుద్ధుడు ప్రబోధించాడు. అదే లోకమంతటికీ శిరోధార్యం. మంచి లక్షణాలతో మనిషి శోభిస్తాడు. అతడి ఆలోచన ఉత్తమ కార్యాలకు అనుకూలంగా ఉండాలి. చెడు పనుల పట్ల విముఖత కనబరచాలి. ఏదైనా పని తలపెట్టినప్పుడు- సందేహం, సంకోచం, సంశయం, భయం వంటివి దరి చేరకుండా చూసుకోవాలి. అనుకున్నది సాధించే నేర్పు, ఓర్పు మనిషి కలిగి ఉండాలని శాస్త్ర వచనం!

మనిషి ముందడుగు వేయకుండా అవాంతరాలు సృష్టించేవి, అడుగడుగునా అడ్డగించేవి కొన్ని ఉంటాయి. అవి- సోమరితనం, దిగులు పడటం, కునికిపాట్లు పడుతుండటం వంటివి. అతి నిద్ర, పనిలో సాఫల్యం సాధించకుండానే వెనుదిరగడం, సంకోచ మనస్కుడు కావడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం మానవ ప్రగతికి అవరోధాలని 'బ్రహ్మాండ పురాణం' చెబుతోంది.

ఎందరో మహారాజులు ఈ భూతలాన్ని ఏలారు. వారిలో కొంతమందే జనహితం కోసం అహర్నిశలూ పాటుపడి, చరిత్రలో ధ్రువ తారలుగా వెలిగారు. సామాన్యులుగా పుట్టినా, సద్గుణ సంపదతో లోకుల మన్నన పొందినవారున్నారు. అప్రతిహతంగా సాగుతూ, అనంతంగా ఎదిగిన అలాంటివారు ఎందరెందరో! ఎదుటివాళ్ల బాధలకు, కష్టాలకు మనసు కరిగినవారు; చేతనైన సహాయం చేస్తూ, బాధితులు నిలదొక్కుకోవడానికి అహరహం కృషి సాగించేవారు సాక్షాత్తు దైవసమానులు!

మనిషి వెళ్లిపోయేటప్పుడు ఎంతమంది ఆఖరి వీడ్కోలు చెబుతారో- దాన్నిబట్టి, అతడి మంచిని అంచనా వేయవచ్చు. మానవుడికి గల వరం, అదృష్టం- అతడి మనసు. మంచిచెడుల బేరీజు వేసి, ఎప్పటికప్పుడు అతడికి తెలియజేసేదీ అదే! మది మంచి వైపు మొగ్గితే, అది భగవత్ తత్వం. అలా కాదని, చెడును ఆశ్రయిస్తే అది దానవత్వం. 'నేను-నా' అనే భావం నుంచి మనిషి బయటపడాలి. 'మనం' అనే ఉత్తమ భావన అతడి హృదయం లోపలి నుంచి వెల్లివిరియాలి. అది శుభసూచకం. అదే మానవుడికి ఉదాత్త స్థితి కలిగిస్తుంది. ఉత్తమ గతికి హేతువవుతుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు